ఎడారిలో బంగళా!

ఏ. వీ. మోహన్రావ్

నేను పెళ్ళి చేసుకోలేదు. అందుకు కారణం నన్ను చేసుకునే వాళ్ళు లేక కాదు. నాకు వ్యక్తిగతంగా పెళ్ళిపైన సదభిప్రాయం లేదు.

ఇప్పుడు నా వయసు నలభై రెండు దాటింది. నన్ను చూసిన వాళ్ళందరూ నాకు ముప్ఫయి మించి వుండవంటూ అంటారు.

నాకు వెనకా ముందూ ఎవ్వరూ లేరు. నాది స్వేచ్ఛా జీవితం. అలాగని గాలిపటంలా ఎటుపడితే అటు ఎగిరే తత్వం కాదు. నాకు అన్ని అలవాట్లు వున్నాయి. తాగుతాను. పేకాడతాను. రేసులకు పోతాను. కానీ ఇవన్నీ సంఘంలో పెద్ద పెద్దవాళ్ళల్లోకి జొరబడటానికి, పలుకుబడి సంపాయించుకోవటానికి మాత్రమే ఉపయోగిస్తాను.

అన్నింటినీ మించి ఆరోగ్యమే మహాభాగ్యం అనుకునే మనిషిని. వ్యాయామం చెయ్యడం, ఈదడం, పరుగెత్తడం, టెన్నిస్ ఆడడం, బలమైన ఆహారం తీసు

కోవడం, లాంటి వాటిల్లో నేనెన్నడూ అశ్రద్ధ చెయ్య లేదు. అందుకే నేను బలంగా వున్నాననుకుంటూ వుంటాను.

అయితే నాకున్న బలహీనతల్లా స్త్రీ సంపర్కం. అదో పెద్ద వ్యసనం. ఇందులోనూ నేను కొన్ని నియమాలు పెట్టుకున్నాను. నాసిరకాలకు, బజారు బాపతులకు, ఎగబడడం నా పద్ధతికాదు. పెద్దపెద్ద సొసైటీల్లో, నాకున్న పరిచయాలన్ని పురస్కరించుకుని, అదను చూసి, అవతలవాళ్ళ బలహీనతలు గుర్తించి నా కోరికలు తీర్చుకుంటూ వుంటాను.

ఆ రోజు ఆదివారం.

డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని కాఫీ తాగుతున్నాను. కార్నర్ టేబుల్ పైనున్న ఫోన్ మ్రోగింది.

లేచివెళ్ళి రిసీవరు పైకెత్తాను. "హలో" అన్నాను మెల్లగా.

"ఎవరు? మాట్లాడుతున్నది రాజాయేనా?" అవతల వేపునుండి వినిపించింది. ఆ కంఠం నాకు బాగా గుర్తే.

"అవును! ప్రొద్దుటే ఫోన్ చేశావేం కోమలీ?" అడిగాను.

"అరే! కనిపెట్టేశావే?" విస్తుపోయింది అవతలివేపు కోమలి.

"అనురాగం, అభిమానం వున్నప్పుడు ఆ మాత్రం గుర్తింపు లేకపోతే ఏముంది. నాకు నీ మీదవున్న ప్రేమకన్నా, నీకు నా మీద చాలా తక్కువుంది!" అన్నాను.

"రాజా! అలాగనకు! ఐ లైక్ యూ! ఐ లైక్ యూ" వగలుపోయింది కోమలి ఫోన్‌లో.

"మరి వాళ్లో అనగానే గుర్తించలేకపోయావ్?" అడిగాను నేను.

"అందుకు కారణం నేను కాదు! మా ఫోన్. దీని సౌండ్ సరిగాలేదు!" సర్ది చెప్పుకుంది కోమలి.

"ఇంతకూ అసలు విషయం ఏమిటి?" అడిగాను.

"ఏంలేదు. మా వారు ఉదయం ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్ళిపోయారు. రెండ్రోజులు రారు. ఈ రెండ్రోజులు సరదాగా ఎటైనా వెళ్దాం!" అంది కోమలి.

కోమలితో నా పరిచయం క్రొత్తగా ఈ మధ్యనే ప్రారంభమైంది. కాటన్ కింగ్ గా పేరు తెచ్చుకున్న పెద్ద మిల్లు ఓనరు భార్య. ఇద్దరు పిల్లలు. రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుతున్నారట. క్లబ్ లకు తిరుగుతూ వుంటుంది. సన్నగా, అధునాతనంగా అలంకరించుకొని వుంటుంది. ఎక్కువగా త్రాగుతూంటుంది. ఓ మారు ఓబ్రాయ్ షెరటాన్ హోటలులో రూం తీసుకున్నాం. ఖర్చంతా ఆమే భరించింది. ఆ తర్వాత మళ్ళీ ఇదే పిలుపు.

"ఎటు వెళ్దాం!" అడిగాను.

"ఈ వూళ్ళోవద్దు. ఎవరైనా చూస్తారు. ఆగ్రాకు పోదామా?"

"పోయి రావడానికి రెండ్రోజులు పడుతుంది" అన్నాను.

"రైలో కాదు! ఫ్లైట్ లో వెళ్దాం. అక్కడ రూం బుక్ చేస్తాను" అంది.

"విమానంలో వద్దు. హాయిగా నా కార్లో పోదాం!" అన్నాను.

"ఓ. కే! తిరిగి వచ్చేటప్పుడు నేను ఫ్లైట్‌లో వస్తాను" అంది కోమలి.

"అలాగే! ఇంకో గంటలో బయలుదేరుదాం" అన్నాను.

"థాంక్స్! స్వీట్ డేస్ అండ్ నైట్స్!" అంటూ ఫోన్ పెట్టేసింది.

నేను కూడా ఫోన్ పెట్టేసి, గబగబ స్నానంచేసి, సూట్ కేస్ నిండా బట్టలు సర్దేశాను. పనిపనిషిని పిలిచి, సూట్ కేస్‌ను కార్లో పడెయ్యమన్నాను. అల్మైరా లోంచి కొంత డబ్బు తీసుకున్నాను. రావడానికి రెండ్రోజులు పడుతుందని చెప్పి, బంగళాలోంచి వెలుపలికి వచ్చి కారెక్కాను.

మలబార్ హిల్స్ ప్రాంతాల్లోవున్న పెట్రోల్ బంక్ వద్ద కారాపి కూర్చున్నాను. ఐదు నిముషాల తర్వాత ఒక టాక్సీవచ్చి ఆగింది. అందులోనుండి కోమలి దిగింది. చేతిలో మీడియమ్‌సైజ్ 'అరిస్టోక్రాట్' సూట్ కేస్ వుంది. పైటకొంగు తలపైన ముసుగులా వేసుకుంది కోమలి.

టాక్సీ డబ్బులిచ్చి, చూట్టూ చూసి, చకచక నడుచు కుంటూవచ్చి కారు బ్యాక్ సీట్‌లో సూట్ కేస్ పడేసి, ముందున్న డోర్ తెరిచి కూచుంది. వెంటనే నల్లటి విండోగ్లాసు పైకెత్తివేసింది.

"నీ జాగ్రత్తలు నువ్వు తీసుకుంటున్నట్లున్నావ్?" అన్నాను ఇగ్నిషన్ కీ త్రిప్పుతూ.

"లెట్స్‌గో! క్విక్!" అంది కంగారుగా.

"అంత కంగారుపడే దానివి ఎందుకొచ్చినట్లు. నేను రమ్మన్నానా?" అన్నాను ఏడిపించాలన్నట్లు.

"రాజా! ముందు మనం త్వరగా వెళ్ళిపోవాలి. ఎవరైనా చూస్తే బాగుండదు. ఊరు దాటాక కబుర్లు చెప్పుకోవచ్చు" అంది కోమలి, రుమాలుతో పెదాలకున్న ఎర్రటి లిప్‌స్టిక్ అద్దుకుంటూ.

మారుమాట చెప్పకుండా కారు స్టార్టుచేశాను. గడియారం వంక చూసుకున్నాను. తొమ్మిది గంటలా పదకొండు సెకన్లు అయింది.

సరిగ్గా నలభైవను నిముషాల తర్వాత నా కారు బొంబాయి నగరం దాటి ఆగ్రారోడ్ పైనున్నాం.

"అమ్మయ్య! ఎవ్వరి కళ్ళల్లో పడలేదు!" అంది కోమలి.

"మీ ఇంట్లో సర్వెంట్సు లేరా? వాళ్ళకు నువ్వి రెండు రోజులు ఇంట్లోలేని సంగతి తెలుసుగా. వాళ్ళు మీవారితో చెప్తారేమో?" అనుమానం వ్యక్తం చేశాను.

కోమలి నన్ను బాగా అనుకుని కూచుంది. ప్రొద్దున్నే తాగివచ్చినట్లనిపించింది ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాల వాసన గమనించాక.

"చెప్పరు. వాళ్ళకంత స్వతంత్రం లేదు. చెప్పినా ఆయన నన్నడగరు. అడిగినా ఏదోఒకటి చెప్పి తప్పించుకోగలను." అంది కోమలి ధైర్యంగా.

"ఇంతకుముందలాంటివి జరిగాయా?" అడిగాను.

"ఆః! ఒకటి రెండుసార్లు జరిగాయి. సర్దిచెప్పేసాను" అంది కోమలి.

"ఇలా రావడం నీ కిది ప్రథమం కాదన్నమాట!"

ఆ మాటలు అంటున్నప్పుడు నాకు మనస్సులో కొంత నిరాశ, నిరుత్సాహం కలిగిన మాట నిజం. ఆమె భర్తను తప్ప మరెవ్వరినీ ఎరగని అమాయకురాలనీ, నా

అందచందాలతో, హావభావాలతో, మాటల నేర్పుతో వలలో వేసుకోగలిగాననీ, ఏదో మూల నాలో నేను పడుతున్న గర్వం కాస్తా అణిగిపోయింది.

"ఊరు దాటడం ఇదే మొదలు" అంది కోమలి.

కొంతలో కొంతయినా మనస్సు తేలిక పడింది. కనీసం ఊరైనా దాటించగలిగిన నా నేర్పును నేనే అభినందించుకొన్నాను.

2

రాత్రి రెండు గంటల ప్రాంతంలో "మార్షల్ హోటల్" ముందు కారాపాను.

రిసెప్షనులో అడగగానే, మా గది తాళం యిచ్చి ఇద్దరు బాయ్స్‌ను పంపారు.

సూట్ కేసులు తీసుకొని, నాలుగో అంతస్తులో వున్న గది చేరుకున్నాం. బాయ్స్ వెలుపలకు వెళ్ళగానే తలుపులు మూసి గొళ్ళెం పెట్టాను.

కోమలి తిన్నగా బాత్ రూంలోకి వెళ్ళిపోయింది. ఐదు నిముషాల తర్వాత తలార స్నానంచేసి వచ్చింది. ఆమె వచ్చాక నేను వెళ్ళాను. నేను స్నానం ముగించుకొని గదిలోకొచ్చేసరికి విస్కీ బ్రాందీ బాటిల్ ఓపెన్ చేసుకొని కూచునుంది.

"ఇప్పుడు మొదలెట్టావా?"

"ఆఁ! ఇది లేనిదే మజా రాదు. మత్తులో వున్నప్పుడే ఒంటికి సెగ కం కావాలి. అప్పుడు కంటికి మాతపడదు." అంది కోమలి గ్లాసు పైకెత్తిపెట్టుకొని త్రాగుతూ.

"నాకు తాగే వాళ్ళంటే అసహ్యం!" అన్నాను ఒంటికి పౌడర్ పట్టించుకుంటూ.

"నువ్వూ ఓ సిప్ త్రాగిచూడు తెలుస్తుంది మజా!" అంటూ గ్లాసు తీసుకొచ్చింది నా ముందుకు.

వద్దంటూ వారించి తోసేశాను.

కోమలి వెళ్ళి మంచంపైన పడింది మత్తుగా.

అంతలో, నేనున్న గది తలుపు తీసేందుకన్నట్లు ఎవరో హాల్ లో కీ పెట్టిన శబ్దమైంది.

వెంటనే గదిలో లైటార్పేశాను.

అవతల వేపునుండి ఎవరో హేండిల్ వంచారు. బలంగా తోసినట్లయింది. గది తలుపు భళ్ళున తెరుచుకుంది.

వరండాలో లైటు గదిలో పడింది. బాత్ రూం తెరచివుండటం గమనించాను. అందులోని లైటుకూడా గదిలో పడటంతో, గదంతా సన్నటి వెలుగుతో నిండిపోయింది.

"వేర్ ఈజ్ షి" తప్పతాగి తూలుతూ లోనికి వస్తూన్న వ్యక్తి, ఎదురుగా లేని మనిషిని ఎవర్నో అడుగుతున్నట్లుగా అడుగుతూ అడుగులు వేశాడు.

అతని వెనుక వెలుగుండటంతో అతన్ని బాగా చూడగలిగాను. నా గుండెలు ఆగిపోయాయి.

అతను కోమలి భర్త ముకుంద్!

ఢిల్లీకి వెళ్ళిన వ్యక్తి ఆగ్రాలో ఎలా ప్రత్యక్ష్యం కాగలిగాడో నా కర్థం కావడంలేదు. అందులోనూ అతని భార్య నా వెంటవుండగా, అంత రాత్రిపూట మా గదికే ఎలావచ్చి తలుపు తట్టగలగాడో ఊహించలేకపోయాను.

అతన్ని వెనక్కు తోసివేద్దామనుకున్నాను. అలా చేసేందుకు నేను చీకట్లో నుండి వెలుతురులోకి రావాలి. రాగానే గుర్తిస్తాడు. గుర్తించాక ఇక వెలుపలకు పోవడం అసాధ్యం. ఈలోగా అతను, తన భార్యను చూసుకోవడం జరుగుతుంది. అదే జరిగితే నా పని క్లోజ్.

అచేతుణ్ణయి నిల్చున్నాను. అవాక్కయిపోయాను.

"సార్! సార్! మీకు చెప్పిన రూం యిది కాదు. నాలుగొందలా ముప్పైఆరులో వుందామె. ఇది మూడొందలా నలభైఆరో నెంబరు గది. రండి" అంటూ ఫ్లోర్ బాయ్ ముకుంద్‌ని చెయ్యిబుచ్చుకుని వెలుపలకు లాక్కెళ్ళాడు.

"నో!నో! ఇదే కరెక్టు. అదిగో, ఆమె మంచంపై ఒంటరిగా వుంది. నువ్విచ్చిన కీతో తలుపు కూడా తెరుచుకుంది." అంటూ గొణిగాడు ముకుంద్.

"నే తీసుకెళ్తాను రండి సార్! సరయిన చోటికి చేరుస్తాగా! నా వెంటరండి! ప్లీజ్!" అంటూ ఆ బాయ్ ముకుంద్‌ను బలవంతంగా వరండాలోకి లాక్కెళ్ళిపోయాడు.

వాళ్ళు కనుమరుగు కాగానే ఠక్కున తలుపు మూసి, క్రిందా పైనా, గొళ్ళేలు వేసి, లైటు వెలిగించాను.

కోమలి వొంటిమీద బట్టలేకుండా మంచానికి అడ్డంగా బోర్లగిలా పడుకుని వుంది.

వీపుమీద తట్టి లేపాను.

"వాట్ డియర్! కమాన్!" అంది మత్తు కళ్ళతో.

"షటప్! మనం డేంజరులో పడ్డాం!" అన్నాను భయంగా.

"ఏమయింది?" అడిగింది అనాసక్తంగా కోమలి.

"నీ భర్త గదిలోకి వచ్చాడు. ఆమె ఎక్కడ? ఆమె ఎక్కడ? అంటూ ఇంగ్లీషులో అరిచాడు. బాగా త్రాగి వున్నాడు" అన్నాను.

"అబ్సర్డ్! మనం ఢిల్లీలో కాదు వుంది, ఆగ్రాలో." ఆఖరి మాట వత్తిపలికింది.

"ఆ సంగతి నాకూ తెలుసు! వచ్చింది మాత్రం ముకుందే. నేను బాగా చూశాను. నాలుగొందలా ముఫైఆరో నెంబరులో వున్నాడు" అన్నాను.

"నిజంగానా?" లేచి కూర్చుంది.

"ముందు బట్టలు వేసుకో!"

సన్నగా వున్న షిఫాన్ నైటీ వేసుకుంది.

"నాకు నమ్మకం చిక్కడంలేదు!" అంది కోమలి.

నేను వెళ్ళి ఫోన్ తీసుకున్నాను. రిసెప్షనులోంచి రెస్పాన్స్ రాగానే "మీ హోటల్ లో అతిధులకు తగిన రక్షణ గౌరవం వున్నాయా?" అడిగాను తెచ్చిపెట్టుకొన్న కోపంతో.

"ఎందుకు సార్! అర్ధరాత్రిపూట లేచి అంత కోపంగా అరుస్తున్నారు?" అడిగాడు అవతలి వ్యక్తి.

"ఎవడో నాలుగొందలా ముప్ఫయి ఆరో నెంబరుకు వెళ్ళవలసిన మనిషి నా గది తాళం తీసుకొని లోనికొచ్చి అల్లరిచేశాడు. ఎవరతను?" అడిగాను నా కంఠంలో కోపపుపాలు తగ్గనీకుండా.

"అతనా! కాటన్ కింగ్ ముకుంద్ సార్! పొరపాటు జరిగి వుంటుంది. ఇకపైన అలాటివి జరగకుండా జాగ్రత్త పడతాను. క్షమించండి!" అన్నాడు అవతలి వ్యక్తి.

"ఓ.కే! అలాంటివి జరగకుండా చూడండి!" అంటూ ఫోన్ పెట్టేశాను.

"ఏమంటాడు?" అడిగింది కోమలి.

"నీ మొగుడు ముకుంద్ అని చెప్పాడు. ఏమిటి మనకు దారి?" అడిగాను భయంగా.

అతను చండశాసనుడు. అతని చేతికింద చాలామంది గూండాలు, హంతకులు వున్నారు. మొదట్లో స్మగ్లింగ్

వ్యాపారం చేసి, ఆ తర్వాత కాటన్ మిల్స్ పెట్టాడు. పగ పట్టాడంటే రేచుకుక్కల్లా వెంటాడి తాచుపాములా విషం కక్కి కరిచే రకమని కొంతమందిద్వారా విన్నాను.

"ముకుంద్ ఎందుకు వచ్చినట్లు? అర్థంగాకుండావుంది?" అంది కోమలి.

నాకేమి మాటలు వినిపించలేదు. ఎలాగైనా ఇక్కడి నుంచి అతని కళ్ళల్లో పడకుండా ఎటు వెళ్ళిపోవడమా అన్నదే సమస్యగా మిగిలింది నాకు.

"కోమలీ! మనం ఇక్కడ వుండడం క్షేమంకాదు! నేను ఇప్పుడే వెళ్ళిపోదలచుకున్నాను. మరి నీ సంగతేమిటి?" అడిగాను.

"నన్నొదిలేసి పోతావా?"

"లేకుంటే వెంట తీసుకువెళ్ళి నీ భర్త చేతుల్లోచిక్కి చావమంటావా?"

"అయితే నన్ను క్షేమంగా ఇక్కడనుంచి ఆగ్రా నగరం దాటించే బాధ్యత నీకు లేదా? నిన్ను నమ్ముకుని వచ్చినందుకు నువ్వు చూపించే ప్రేమ ఇదేనా?" కోమలి కోపంగా ఏడుస్తూ అడిగింది.

"అదికాదు. నిన్ను స్టేషనులో దింపుతాను. ఏదో ఒక రైలు ఎక్కి అటు ఢిల్లీకో లేక, బొంబాయికో చేరుకో! నా త్రోవ నేను చూసుకుంటాను" అన్నాను.

"అలాగే!" అంది కోమలి.

గబగబ బట్టలు సర్దుకున్నాం.

సూట్ కేసులు తీసుకొని, క్రిందకొచ్చాం. కోమలి తిన్నగా వెళ్ళి కారులో కూర్చుంది. నేను రిసెప్షన్ లోకి వెళ్ళి మిగిలిన డబ్బు తీసుకుని రూం తాళం ఇచ్చాను.

"ఏంసార్! మా హోటల్‌లో ప్రైవసీ లేదని వెళ్ళిపోతున్నారా?" అడిగాడతను తాళం తీసుకుంటూ.

"అవును" అన్నాను.

"ఎక్కడా అనకండి సార్. మా బిజినెస్ కాస్తా పడిపోతుంది."

"నాకవసరమేముంది! థాంక్స్!" అంటూ వెనక్కి తిరిగొచ్చి కారెక్కాను.

ఆగ్రా సిటీ స్టేషనులో కోమలిని దిగవిడిచాను.

కారులోనే కూర్చుని కాసేపు ఆలోచించాను. ఢిల్లీ వెళ్ళడంకన్నా, తిన్నగా బొంబాయి వెళ్ళడమే మంచిదని తోచింది. కారును స్టార్ట్ చేశాను. కొంతదూరం పోయాక పెట్రోలుబంక్ ఒకటి వచ్చింది. టాంక్ నిండా పెట్రోలు పట్టించుకున్నాను. రోడ్ పట్టుకున్నాను.

ఎంతో ఆవేశంతో, ఆనందంతో బయలుదేరిన నాకు జరిగిన సంఘటనలు తలపుకు రాగానే చాలా నిరుత్సాహం కలిగింది. నా జీవితంలో ఇది మొదటి అనుభవం. ఇదే ఆఖరు అనుభవం అయ్యేలా చూడమని భగవంతుణ్ని మనస్సులోనే కోరుకున్నాను.

3

తొమ్మిది గంటలయ్యేసరికి రాజస్థాన్ ఎడారి మధ్యగా క్రొత్తగా వేసిన రోడ్ మొదటకి చేరాను.

మూడువందల మైళ్ళుందా రోడ్డు. మధ్యలో ఎక్కడా మానుగానీ, మరేవిధమైన మానవ సంచార సంచలంకాని లేదని విన్నాను. రెండు పెట్రోలుబంకులు మాత్రం వున్నాయి. ఆ రోడ్ వెంట రాత్రిపూట ఎవ్వరూ వెళ్ళరు. పగలు వెళ్తుంటారు. టోల్ గేట్ వద్ద డబ్బు చెల్లించి నా కారు నెంబరు, పేరు చెప్పాను. అతను రాసుకున్నాడు.

"రోడ్ ఎలా వుందట?" అడిగాను అతన్ని.

"ఫరవాలేదు! బాగానే వుంది. ఇంతకుముందే మూడు కార్లు ఆరు లారీలు వెళ్ళాయి. ఇసుక తుఫాను లేవీలేవు. అలా వుంటే మాకు వర్తమానం అందుతుంది. అప్పుడు వేట్ని వదలము" అన్నాడతను.

"థాంక్స్!" చెప్పి స్టార్టుచేశాను.

ఎక్కువ రద్దీ లేనందువల్ల ఆక్సిలేటరు పూర్తిగా నొక్కాను. మంచి స్పీడందుకుంది. అదే స్పీడులో బండిని నిలకడగా పోనిచ్చాను.

నూట ఇరవై మైళ్ళు వెళ్ళాను. ముందు కారు టైరు టప్పుమని పగిలింది.

క్రిందికి దిగి చూశాను. టైరు పగిలిపోయి వుంది. లాభం లేదని, ఇగ్నిషన్‌లోంచి తాళాలు తీసి వెనుక వేపు డిక్కీ తెరిచేందుకు వెళ్ళాను. డిక్కీలో తాళం పెడుతుంటే, లోనికి వెళ్ళలేదు. హాండిల్ అటూ ఇటూ త్రిప్పి పైకి లాగాను. డిక్కీ తెరచుకుంది. లోపల స్టెప్నీ కనుపించలేదు.

బొంబాయినుంచి బయలుదేరేముందు స్టెప్నీ తీసుకొచ్చిన విషయం నాకు బాగా గుర్తుంది. ఆగ్రాలో హోటల్‌లోకి వెళ్ళేప్పుడు తాళం వెయ్యడం గుర్తుంది. మరి స్టెప్నీ ఏమయింది?

హోటల్ కాంపౌండ్‌లో వుండగానే ఎవడో దొంగ వెధవ మారుతాళంతో డిక్కీ తెరచి స్టెప్నీ దొంగిలించి వుంటాడనిపించింది. 'మార్వెల్ హోటల్'ను లోలోపలే తిట్టుకున్నాను. ఒకవేళ బ్యాక్ సీటులో పొరపాటున పెట్టేనేమోనని, తలుపు తెరిచిచూచాను. కనుపించలేదు.

ఫ్లాస్క్‌లో కాఫీ వుంది. రెండు మాడరన్ బ్రెడ్‌లు

వున్నాయి. పెట్రోలు నింపుకునేందుకు ఏర్పాటు చేసిన స్టేషను ఇంకెంత దూరంలో వుందో నాకు తెలీదు.

కారెక్కి కూర్చున్నాను, ఏదైనా వాహనం రాక పోతుందాని. సిగరెట్టు ముట్టించుకుని కారులోవున్న రేడియో ఆన్ చేశాను. లోపల కాసెట్ టేప్ వుంది. వెనుకనున్న స్పీకర్‌లోంచి కమ్మటి వెస్టరన్ మ్యూజిక్ వినవస్తుంది.

వింటూ, సిగరెట్ తాగుతూ ఎదురుగా అనంతంగా ఆకాశంలోకి దూసుకుపోతూ కనిపిస్తున్న రోడ్ కేసి చూడసాగాను.

గంట గడిచింది. ఒక్క కారుకూడా రాలేదు రెండు వేపుల్నుండి.

నాకు విచిత్రంగా వుంది. ఇసుక తుఫాను రాబోయే ప్రమాదమున్నప్పుడు మాత్రమే కార్లను ఆపుచేస్తారు. వెనుకనుండి కూడా ఏ విధమైన సంచలనం లేదంటే ఇసుక తుఫాను రాబోతుందేమోననిపించింది.

ఫ్లాస్క్ ఓపెన్ చేశాను. సగందాకా వుంది కాఫీ. జాగ్రత్తగా వాడుకోవడం మంచిదనిపించింది. కొద్దిగా మూతలోనికి వంచుకొని పెదాలు తడుపుకున్నాను. మళ్ళీ యధాతధంగా ఫ్లాస్కు మూత బిగించి పెట్టాను.

తెల్లగా, వెండిలా మెరుస్తున్న ఎండ వున్నట్టుండి ఎర్రగా మారిపోయింది. నా కుడి చెంపమీద దూరం నుంచి ఎవరో సూదులు విసిరినట్లు గ్రుచ్చుకుంటున్నట్లని పించింది.

రానున్న ఇసుక తుఫానుకు ఇది సంకేతమని అర్థం చేసుకోవటానికి నా కెక్కువ టైం పట్టలేదు. గబగబ కారు అద్దాలన్నీ ఎత్తివేశాను. హాండ్ బ్రేక్ కూడా వేసు కుని కూర్చున్నాను.

చెవులు చిల్లులు పడేట్లుగా శబ్దం రాసాగింది. కారు ముందుకూ, వెనక్కూ, ప్రక్కకూ ఊగిపోయింది. ఆ తుఫాను స్పీడుకు అసలు కారు ఎడారిలోకి కొట్టుకు పోతుందేమోనని భయపడ్డాను.

దాదాపు గంటసేపు నా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కూర్చున్నాను.

వెలుపల శబ్దం తగ్గింది. వెలుగు ఎరుపు రంగునుండి మెల్లగా, తెలుపు రంగుకు తిరగడం ముందు అద్దంలోంచి గమనించాను. ముందున్న రోడ్ నిండా ఇసుక నిండివుంది. రోడ్ ఎటుందీ చెప్పడానికన్నట్లు అక్కడక్కడా కొన్ని స్తంభాలు నాటివుంచారు.

ఈ గందరగోళంవల్లే చాలామంది ఈ ఎడారి రోడ్ వెంట రావడం మానుకున్నారనుకున్నాను. వేరు త్రోవన పోతే దాదాపు మూడొందల మైళ్ళు ఎక్కువవుతుంది. నేను త్వరగా బొంబాయి చేరుకుందామన్న ఆతృత కొద్దీ ఈ త్రోవన వచ్చాను.

తుఫాను ఆగినట్లనిపించింది. అద్దాలు దించి చూచాను. గాలిలో ఇసుక లేదు.

ఫ్లాస్కు తీసి మెళ్ళో వేసుకున్నాను. బ్రెడ్ లు రెండు చేత్తో పట్టుకున్నాను. తలుపులు బిగించి తాళం వేసి' ముందుకు నడక ప్రారంభించాను.

గాలిలో తేమ లేనందువల్ల, నాలిక పిడచగట్టుకు పోయింది. నా దగ్గరున్న రెండు కప్పుల కాఫీతీసి పట్టుకుని పది ఫర్లాంగులన్నా నడవగలనో లేదోనన్న అనుమానం కలిగింది.

పట్టుదలతో ముందుకు కదిలాను. మనిషి ఎంత ఒంటరి వాడో, ఎంత సూక్ష్మజీవో, ప్రకృతి కంత సులభంగా

బండీ కాగలడో, చూడాలంటే అంతకన్నా వేరే స్థితి అవసరం లేదనిపించింది నాకు.

అడుగులో అడుగు వేసుకుంటూ నడిచాను. తొంభై నిముషాల నడకతో ఐదు మైళ్ళు ముందుకు పోగలిగాను. కనుచూపు మేరలో ఎక్కడా పెట్రోలు బంకు కనిపించ లేదు. ఎదురుగా ఏదో వాహనం వస్తూన్న సూచనలు అంతకన్నా కనుపించలేదు.

భగవంతుడిపైన భారంవేసి, రెండు స్పూన్లు కాఫీ త్రాగి, ఒక రొట్టెముక్క తిని, ముందుకు కదిలాను. జేబులో డబ్బుంది. దాదాపు ఐదువేలు. కానీ దానికి ఎడారిలో విలువ శూన్యం.

టైం చూసుకున్నాను. సాయంత్రం నాలుగు కావస్తూంది.

అంటే మరో రెండు గంటల్లో ఆ పెట్రోలు బంకు చేరగలిగితే నాకు బ్రతికే అవకాశమున్నట్లు. అలా కాకుంటే లేనట్లే ననుకున్నాను.

దూరంగా చిన్న గుడిసె లాంటిది కనుపించింది. అదే పెట్రోలుబంకు అయివుండాలనుకున్నాను. ఆ ఆశ నాలో క్రొత్త ఆవేశాన్ని సృష్టించింది. నాకు తెలీకుండానే వేగంగా ముందుకు కదిలాను.

పది నిముషాల నడకతో ఆ ప్రాంతం చేరుకున్నాను.

అదొక చిన్న గుడిసె ఆకారంలో వుంది. అక్కడ పెట్రోలు, డీసిల్ పోసే పంపులున్నాయి. గుడిసె దగ్గరకు వెళ్ళాను.

4

ఆ గుడిసెలో పక్కమంచంమీద లుంగ చుట్టుకుని ఒక ఆకారం వుంది. మంచంకు కొంచెం దూరంలో టెలిఫోన్ వుంది.

"బాబూ!" పిలిచాను మెల్లిగా.

ఆ ఆకారం కదిలింది. కానీ లేవలేదు.

"ఏయ్ బాబూ! నిన్నే!" అన్నాను.

"పెట్రోలా? డీసెలా?" కళ్ళు తెరవకుండానే, అలాగే పడుకుని అడిగాడు.

"రెండూ కాదు! ముందు టైరు కావాలి!" అన్నాను.

అతను తక్కున లేచి కూర్చున్నాడు. కాళ్ళు మంచం పైనుండి క్రిందికి క్రేలాడేసి చేతివ్రేళ్ళతో జుట్టును ఎగదోసుకున్నాడు.

అప్పుడు చూశాను. ఆ వ్రేళ్ళు తెగిపోయినట్లున్నాయి. కాలంతా చీము రక్తంతో తడిసివుంది. అతను కుష్ఠురోగి అని సులభంగా తెలిసిపోయింది. నాకు కడుపులో త్రిప్పినట్లయింది.

"ఏమిటీ టైరు కావాలా? టైర్లు ఇక్కడ దొరకవు" అన్నాడు లేస్తూ.

"నా కారు టైరు బరస్ట్ అయింది. ఇక్కడికి దాదాపు పదిహేను మైళ్ళ దూరంలో వుంది కారు. నాకేమిటి?" అడిగాను అతన్ని భయంతో.

"రెండ్రోజులు ఈ రోడ్ మూసేశారు. ఇందాక ఇసుక తుఫాను వచ్చింది" అన్నాడు అతను.

"ఇక్కడ నువ్వొక్కడివే వుంటావా?"

"ఆఁ!

"నీకు ఆహారం నీళ్ళూ ఎలా?"

"నా దగ్గరున్నాయి. నీకు కావాలా?" అడిగాడు ఆ వ్యక్తి.

కావాలని అందామని పెదవిదాకా వచ్చింది. అతని కాళ్ళు చేతులూ చూచి "వద్దు! నా ఫ్లాస్కులో కాఫీ వుంది. అది చాలు" అన్నాను.

"నిలబడే మాట్లాడుతున్నారు. కూర్చోండి!"

"ఫరవాలేదు. నేనీ ప్రాంతంనుండి బయటపడే మార్గం చూపించు. నీకు ఏంకావాలన్నా ఇస్తాను" అన్నాను. అతను తప్ప నన్ను రక్షించగల దేవుడెవ్వరూ ఆ దరిదాపుల్లో ఇంకెవ్వరూ కనుపించకపోవటంతో.

"ఏదైనా కారొచ్చేదాకా ఆగండి. దాంట్లో ఎక్కించి చెప్పి పంపుతాను."

"రెండ్రోజులు రావన్నావుగా?"

"రావు!"

"మరి అప్పటిదాకా..."

"ఇక్కడే నాతో వుండండి. ఏం భయంలేదు."

అతన్ని చూసి కాదు నాకు భయం. అతని జబ్బును చూసి. ఆ మాట చెప్పాలనిపించింది. అయినా అనవసరంగా విరోధం కొని తెచ్చుకోవడం అవివేకమనిపించి ఆగాను.

లోపల ఫోన్ మ్రోగింది.

అతను ఎత్తుకొని కొన్ని క్షణాలు మాట్లాడాడు. నాకది అర్థంకాలేదు. సంభాషణ చాలాసేపు నడచింది. ఆ తర్వాత అతను ఫోన్ పెట్టేశాడు.

"ఎక్కడ్నుంచి ఆ ఫోన్?" అడిగాను.

"టోల్ గేట్ నుంచి" అన్నాడు.

"ఏమంటున్నారు."

"ఈ రోడ్ పైన మూడుకారులు చిక్కుకుపోయాయట. అవి అవతలివేపుకు వెళ్ళాయా అడిగాడు. రెండు వెళ్ళిపోయాయని చెప్పాను. మూడోది బహుశా మీదయి వుంటుంది. చాలా పెద్ద తుఫాను రేగిందట. ఈ పాటికి మీ కారు ఇసుకలో కూరుకుపోయి వుంటుంది" అన్నాడతను.

"రోడ్ కూడా ఇసుకలో పూడుకుపోతుందా?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఆఁ! వారానికొకసారి రోడ్ క్లీన్ చేస్తుంటారు."

"ఎలా?"

"స్పెషల్ లారీలున్నాయి. వాటికి రెండువేపులా పార లుంటాయి. అవే ఇసుకను అటూ ఇటూ తోసివేస్తాయి."

"ఆ లారీలు వస్తేగానీ నా కారు మళ్ళీ నాకు దక్కదంటావ్. అంతదాకా ఇక్కడ ఇలా నీతో వుండాల్సిందేనా?" అడిగాను ఏడుస్తూ.

"అంతకన్నా వేరే మార్గం వున్నట్లు నాకు తోచడం లేదు! కూర్చోండి" అన్నాడు అంతదాకా నేను నిలబడి వుండడం గమనించి.

నాకు కాళ్ళు పీక్కుపోతున్నాయి. లాభంలేదని క్రిందే కూలబడ్డాను. ఫ్లాస్కు తీసి కొద్దిగా కాఫీ త్రాగాను.

"నా కివ్వకుండా మీరే త్రాగుతున్నారు. అది అన్యాయం!" అన్నాడు అతను.

"ఈ ఎడారిలో కాఫీ దొరకదు. అది లేకుంటే నా ప్రాణం నిలవదు. అందుకని ఇవ్వలేదు."

"నా దగ్గర కాఫీపొడి, పాలపొడి, నీళ్ళు అన్నీ వున్నాయి. కావాలంటే నిముషంలో కాఫీ చెయ్యగలను" అన్నాడతను.

"నాకొద్దు! నువ్వు చేసుకుని త్రాగు" చెప్పాను.

అంతలో దూరంగా ఏదో కారు హారను వినిపించింది. ఆశగా వెలుపలకు చూశాను.

అంతదాకా అటూఇటూ చూస్తూ కూర్చొని నాతో కబుర్లు చెపుతున్న వ్యక్తి, ఆ శబ్దం రాగానే, లేచి రోడ్ లోకి వెళ్ళాడు.

ఒక నిముషం తర్వాత, పెద్ద జీపొచ్చి నిలిచింది. దాని వీల్ ముందు నలభై సంవత్సరాలున్న మనిషి ఆధునికమైన డ్రెస్‌లో కూర్చుని వున్నాడు.

నాతో మాట్లాడిన వ్యక్తి అతనికి వంగి వంగి నమస్కారాలు చేశాడు. జీపు టాంక్ నిండా డీసెల్ పట్టాడు.

మెల్లిగా అతనివేపు వెళ్ళాను.

"నమస్తే!" అన్నాను.

అతనుకూడా నావైపు చూసి "నమస్తే! ఎవరుమీరు? ఇక్కడికెలా వచ్చారు?" అడిగాడు.

నా కథంతా చెప్పుకున్నాను.అతను శ్రద్ధగా విన్నాడు.

"నా కారు ఇసుకలో ఇరుక్కుపోయింది. వెంట తెచ్చుకున్న తిండి అయిపోయింది. ఈ కుష్ఠురోగివాణ్ని చూస్తేనే నాకు భయంగా వుంది. ఏం చెయ్యాలో తోచక తన్నుకులాడుతున్నాను. ఇంతలో మీ జీపు వచ్చింది. మీ రెటు వెళ్తున్నారు" అడిగాను.

"ఎటూ వెళ్ళడం లేదు!" అన్నాడతను తాపీగా ఇండియా కింగ్స్ సిగరెట్ కాల్చుకుంటూ.

"వెళ్ళడం లేదా? మరి జీపులో వచ్చారు." గుర్తు చేశాను.

"అవును. నా బంగళా ఇక్కడికి దగ్గరలోనే వుంది. అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాను" అన్నాడతను.

"ఈ ఎడారిలో బంగళా ఏమిటండీ!" నమ్మశక్యంగాక విస్తుపోతూ అడిగాను.

"ఇక్కడ్నుంచి ఇరవై మైళ్ళు కుడివేపుగా వెళ్ళితే, ఎడారిలోనే పెద్ద కొండ వుంది. దానిపైన చక్కటి బంగళా కట్టించాను. అందమైన చెట్లు వేయించాను. ఆ కొండ నానుకొని సన్నని ఏరు పారుతుంది. మాకు కావల

సిన నీళ్ళన్నీ అందులోనుంచి పంప్ చేయిస్తాను. నా బంగళాకు జైనరేటరుంది'' అన్నాడు అతను.

''ఇంతకూ మీ రెవరో చెప్పలేదు!''

''ఈ దేశంలో వున్న ప్రైవేటు ఉక్కు, ఇనుము, అల్యూమినియం, ఫ్యాక్టరీలన్నీ ఎవరివో మీకు తెలుసా?''

''తెలుసు. అమృత్ లాలావి కదూ!''

''అతన్ని మీరు చూశారా?''

''లేదు!''

''నేనే ఆ లాలాని.''

''ఆ లాలా మీరేనా? అయితే ఇంత దేశం వదలిపెట్టి ఈ ఎడారిలో వచ్చి చేరారేం?'' అడిగాను ఆశ్చర్యాన్ని ఆణచుకోలేక.

''భార్యా, రూపసీ, శత్రుః అన్న నానుడి విన్నారా?'' అడిగాడు లాలా.

''విన్నాను'' అన్నాను.

''నా భార్య అతిలోక సౌందర్యవతి. ఆమె దృష్టి మరొకరిపైన పోకుండా వుండేందుకు, ఆమె నానుండి దూరంగా పోకుండా రక్షించుకునేందుకు నివాసం ఇక్కడ పెట్టాను'' అన్నాడు లాలా.

''మీరు చాలా ఫ్రాంక్ గా మాట్లాడుతారు'' అన్నాను.

''మీతోనే కాదు! నా భార్యతో కూడా ఇలాగే మాట్లాడుతాను. ఇంతకూ మీరేం చేస్తారు'' అడిగాడు లాలా'

''ప్రొఫెసర్ గా పనిచేస్తున్నాను.''

''ఎక్కడ?''

''బొంబాయిలో.''

"ఐ.సి. వెళ్ళయిందా?" అడిగాడు లాలా.

"అఁ! ఇద్దరు పిల్లలు కూడానండీ. నా భార్య వేరే ఒక డితో లేచి వెళ్ళిపోయింది. దాంతో ఆడదంటేనే నాకు అసహ్యం పుట్టుకొచ్చింది. వాళ్ళకు దూరంగా వుండడం అలవాటు చేసుకున్నాను" అన్నాను.

ఇలాంటి కట్టుకథ చెప్పడం ఆ క్షణంలో ఎంతో అవ సరమనిపించింది. అందగత్తె అయిన భార్య వేరేవాళ్ళ దృష్టిలో పడకుండా వుండేందుకతను ఇంతదూరం వచ్చి వుంటే, నేను నిజమైన కథ చెప్తే దగ్గరకు రానివ్వక పోవడ మటుంచి, ఏ తుపాకిలోనో కాల్చి చంపినా చంప గలడనిపించింది.

ఈ కష్టురోగి నుండి దూరంగా వెళ్ళాలంటే 'లాలా' గారికన్నా వేరే దిక్కెవ్వరూ నాకు కనుపించలేదు.

"ఎలాగా రెండ్రోజులన్నా కానిది ఈ రోడ్ బాగు పడదు. అంతదాకా మీరు నా గెస్ట్‌గా వుండటానికి అభ్యంతరం లేదనుకుంటాను." అడిగాడు లాలా.

"మరి, నా కారు సంగతి."

"వాడితో చెపుతాను" అంటూ బంట్రోతువాలను పిలిచి ఏదో చెప్పాడు. వాడు తలూపుతూ వుండిపోయాడు.

5

జీప్ బయలుదేరింది.

"మీ భార్యతో మీరు ఎన్నేళ్ళు కాపురం చేశారు?" అడిగాడు లాలా.

"ఎన్నో ఎక్కడండీ! ఆరేళ్ళు."

"మీ దాంపత్యం ఎలా వుండేది."

"అప్పట్లోఅన్యోన్యంగానే వుండేవాళ్ళం.మధ్యలో ఆ మనిషికేం జబ్బు పుట్టుకొచ్చిందో తెలీదు. తనకన్నా చిన్న

వాడైన పత్రాడితో సంబంధం పెట్టుకొంది. నాకు తెలీకుండా నా యింట్లోనే ప్రేమాయణం మొదలైంది. ఒకసారి ఇద్దరూ చిక్కారు. ఘట్టిగా నిలదీసి అడిగాను. సమాధానంగా పిల్లల్ని నా మోహానకొట్టి తనొక్కతే అతని వెంట వెళ్ళిపోయింది'' దీనంగా, దిగులు, బాధ, కోపం కోడించి చెప్పాను అతన్ని నమ్మించాలన్న ఊహతో.

''ఆరేళ్ళపాటు ఆడదానితో సంసారంచేసి, అందులోని సుఖం తెలిసిన మీరు ఆ తర్వాత ఎలా తట్టుకున్నారు?'' అడిగాడు లాలా. ఇది నేను ఎదురుచూడని ప్రశ్న.

''ఆమె వెళ్ళాక పిల్లలతో పెద్ద బాధయిపోయింది. రాత్రింబవళ్ళు వాళ్ళ చాకిరీతోనే సరిపోయింది. నరాలు బాగా వీక్ అయిపోయాయి. గుండె దెబ్బతినింది. డాక్టర్ పరీక్షచేసి, నాకు మగతనం పోయిందన్నాడు. ఎంతోమంది రెండో పెళ్ళికి పిల్లను ఇస్తామన్నారు. కానీ లాభం లేదని నాకు తెలుసు. అందుకని ఏదో చెప్పి తప్పించుకున్నాను.''

''ఆమె మిమ్మల్ని చాలా రకాలుగా దెబ్బతీసిందన్నమాట!'' అన్నాడు లాలా.

''అవునండీ!'' అన్నాను.

లాలా సిగరెట్ తీసిచ్చాడు. కాల్చుకున్నాను.

కారు ఎత్తైన కొండమీదున్న రోడ్ పైన పోసాగింది. రోడ్ కు రెండువైపులా లైట్లు వెలుగుతున్నాయి. పైన లైట్ల వెలుగులో తెల్లగా మెరుస్తున్న భవనం కనిపించింది. లాలా గారి బంగళా అదే అయివుంటుందనుకున్నాను.

మరో ఐదు నిముషాల్లో జీపు బంగళా పోర్టికోలో ఆగింది.

ఇద్దరం దిగాం.

"ఎలా వుంది?" అడిగాడు లాలా.

"ఈ వాస్తు శైలి చూస్తే చాలా పాత భవనంలాగుంది" అన్నాను.

"కరెక్ట్! ఇది మొగలాయి సామ్రాజ్యకాలంలో కట్టింది. ఈ మధ్య నేను కొన్నాను. కొన్నాక రీమోడల్ చేయించాను. హెలికాప్టర్ వచ్చి పోయేందుకు వీలుగా హెలిపాడ్ కూడా వేయించాను" అన్నాడు లాలా.

ఇద్దరం బంగళాలోనికి వెళ్ళాం.

ఆ బంగళాలో మొత్తం మూడంతస్తులున్నాయి. ఇద్దరు పనివాళ్ళు వచ్చారు. మా కోట్లు, బూట్లు వాళ్ళే విప్పారు. క్రిందున్న గదులన్నీ చూపించాడు లాలా.

ఇద్దరం మెట్లెక్కి పై అంతస్తుకు వెళుతున్నాం. పైనుంచి క్రిందకు దిగి రాబోయిన అందమైన స్త్రీ ఒకామె తక్కున ప్రక్కకు తప్పుకుంది. నా ఎక్స్‌రే కళ్ళు ఆ నిముషంలోనే ఆమె అందచందాల్ని, రూపురేఖా విలాసాల్ని, మనస్సుపై ముద్రకొట్టేశాయి.

లాలా చెప్పింది అతిశయోక్తి కాదు.

ఇద్దరం పై అంతస్తు చేరాం. పైన మొత్తం పన్నెండు గదులున్నాయి. కుడివేపు చివర అతని భార్యగదనీ, దాని ప్రక్కనున్నది తనదనీ చెప్పాడు. ఎడమ వేపునున్న ఆఖరిగది నాకు ఇచ్చాడు. అది తెరచి చూపించాడు. అందులో అన్ని ఏర్పాట్లు వున్నాయి.

"చాలా బాగుంది!" అన్నాను.

"తొమ్మిదిన్నరకల్లా క్రిందకు రండి. డిన్నర్ రెడీగా వుంటుంది. అంతదాకా రెస్ట్ తీసుకోండి. మీకేం కావా

లన్నా బెల్ ప్రెస్ చేయండి — సర్వెంట్ వస్తాడు" చెప్పాడు లాలా.

"థాంక్స్! ఒక్క కప్పు వేడి టీ త్రాగుతే చాలు. మరింకేం అవసరం లేదు. తిన్నగా డిన్నరుకు వస్తాను" అన్నాను.

"డ్రెస్ చేంజ్ చేసుకోండి. మీ గదిలో బీరువా నిండా వున్నాయి బట్టలు. ఏదో ఒక జత సరిపోయి తీరుతుంది. నేను వస్తాను" అన్నాడు లాలా.

"థాంక్స్!" అన్నాను.

"మరోమాట! అవసరం లేకుండా గదిదాటి బైటకు రావద్దు. అది చాలా ప్రమాదకరమైనది" అన్నాడు లాలా.

"అలాగే! నేను వెలుపలకు రావలసిన అవసరమే లేదుగా?" అన్నాను నవ్వుతూ.

6

అలా వెళ్ళిపోయాక, గది తలుపులు మూసి కూర్చున్నాను కాసేపు. సిగరెట్ వెలిగించుకొన్నాను.

అంతలో తలుపు తెరుచుకుని ఒక సర్వెంట్ ట్రేలో టీ తెచ్చి, టేబుల్ పైన పెట్టి వెళ్ళిపోయాడు.

లేచివెళ్ళి తలుపుమూసి వచ్చి టీ కలుపుకుని త్రాగాను. ఆ తర్వాత బాత్ రూంలోకి వెళ్ళి స్నానంచేసి వచ్చాను. ఎడమవేపున్న కిటికీ తెరిచాను.

ఎదురుగా తోట కనిపించింది. అందులో ఫ్లోరసెంటు కాంతి పడుతున్నచోట లాలా, అతని భార్య ఉయ్యాల ఊగుతూ కనుపించారు.

అతని ముఖం కిటికీకి ఎదురుగా వుంది. నన్నెక్కడ చూస్తాడోనని భయంవేసి దగ్గరగా వేశాను. సన్నటి

సందు మిగిల్చాను. అందులోంచి చూచాను. ఆమె బాగా కనిపించింది.

నల్లటి పైజామా వేసుకుని, అదేరంగు షర్టు తొడుక్కుంది. షర్టుపై బటన్లు వేయకపోవడంతో ఆమె యవ్వనపు గుర్తులు ఎత్తుగా ఎగిరిపడటం గమనించాను. శంఖం లాంటి తెల్లటి సన్నటి మెడ. సన్నటి పెదాలు. పొడవుపాటి ముక్కు, వెడల్పుగా వున్న కళ్లు. అపర రతీదేవిలా వుందామె. లాలా చెయ్యి ఆమె భుజంపైన ఆమె చెయ్యి లాలా నడుం చుట్టూ వున్నాయి.

ఆమె నెలాగైనా వల్లో వేసుకునే ప్రయత్నం చెయ్యమని నా మనస్సు నన్ను పురమాయించింది. దాని ఆజ్ఞకు తిరుగులేదు మామూలుగా. తలుపు గట్టిగా మూసి, గబగబ డ్రెస్ చేసుకున్నాను.

కిటికీ తలుపు తొలగించి చూశాను. తోటలో ఎవరూ లేరు. ఉయ్యాల ఖాళీగా వుంది.

గడియారం గబగబ ముందుకు త్రిప్పాను. తొమ్మిదిన్నర దగ్గర ఆపాను.

మెల్లగా గదిలోంచి బైటికొచ్చాను. చిన్నగా అడుగులు వేసుకుంటూ మెట్లదాకా వచ్చాను. ఒక్కొక్క మెట్టే మెల్లగా క్రిందకు దిగసాగాను.

ఆమె మెల్లగా మెట్లెక్కటం చూశాను. పైకి చూస్తూ వస్తూంది. ఆమె కళ్ళలో ఓ రకమైన మెరుపు కనిపించింది. నేను కాస్త కంగారుపడ్డట్లు నటించాను. వెనక్కి పోబోయినట్లు అడుగు తీశాను.

ఆమె స్పీడుగా ముందుకొచ్చింది. అప్పుడు చూశాను. మెళ్ళో రాళ్ళ నెక్లెసు ధగధగలాడుతూంది. జుట్టు చెదరిపోకుండా రిబ్బను కట్టుకొంది.

"మీరేనా ప్రొఫెసర్!" మెల్లగా అడిగిందామె రెండు మెట్లు క్రిందకి దిగి.

అవునన్నట్లు తలూపాను.

"ఎక్కడికి?"

"డిన్నరుకు." రహస్యం చెప్పినట్లు చెప్పాను.

"టైం కాలేదు. ఇంకా గంట టయిముంది."

"నా వాచీ తొమ్మిదిన్నరయింది."

"ఇప్పుడు ఎనిమిదిన్నరే!" అందామె నా దారికడ్డొస్తూ.

"సారీ!" అంటూ వెనక్కి తిరిగాను.

ఆమె ముందూ, నేను వెనకా నడిచాం. నేను చుట్టూ చూస్తున్నాను ఎవరైనా నన్ను గమనిస్తున్నారేమోనని. ఎవ్వరూ నన్ను చూడలేదు. పై అంతస్తు వరండాలోకొచ్చాం యిద్దరం.

"నా గది తెలుసా?" అడిగింది ఆమె నవ్వుతూ.

"ఆc! ఆ చివరిదని చెప్పాడు లాలా!" అన్నాను.

"రాత్రి రెండింటికి గడియతీసి వుంచుతాను. నిశ్శబ్దంగా వచ్చెయ్యి. లైట్లు జోలికి పోకు. ఎలా వచ్చావో అలా వెళ్ళిపో!"

"అలాగే! లాలా వుండరా?"

ఉండడన్నట్లు తలూపింది. ఆ తర్వాత వేగంగా ఆమె తన గదికేసి వెళ్ళిపోయింది.

నేను వేగంగా నా గదిలోకి జొరబడ్డాను.

నా ఆనందానికి అంతులేకుండా పోయింది. ఆడ పోయిన తీర్థం ఎదురయినట్లుగా వుంది. ఆమె కోసం ఎంతో ప్రయత్నం చెయ్యాల్సి వుంటుందనీ, నా దన్న

నలభై ఎనిమిది గంటల వ్యవధి చాలదని అనుకున్నాను. నాలుగే నాలుగు నిముషాల్లో వ్యవహారం తెమిలిపోయింది.

అద్దంలో నన్ను నేను గర్వంగా చూసుకున్నాను.

ఆమె ధైర్యం, సాహసం తలచుకొంటే, పరపురుషుడి పొందుకోసం ఆమె ఎంత తపించి పోతుందీ నాకర్థమయింది. అందులోనూ నాబోటి అందగాడు కంటబడ్డాక అవకాశం జారవిడుచుకోవడం ఆమెకూ ఇష్టం వుండి వుండదనుకున్నాను.

అంతలోనే అనుమానం రేగింది. ఒకవేళ నన్ను పరీక్షించమని లాలా ఉసిగొలిపివుంటాడేమో ననుకున్నాను. ఎంత అనుమానమున్నా, లాలా ఇటువంటి పరీక్షలు పెట్టడనిపించింది.

ఇది పరీక్షే అయితే నేను పట్టుబడడం ఖాయం. అలా పట్టుబడ్డప్పుడు అతను నాకే శిక్ష విధించినా, క్షణాల్లో అమలుజరుగుతుంది. నన్ను నేను రక్షించుకునే దారి ఏదీ లేదు.

ప్రాణాలకు తెగించి ఈ వ్యవహారంలో ముందడుగు వేయాల్సిన అవసరమున్నట్లు ఫీలయ్యాను. అలాగే ఆలోచించుకుంటూ మరోగంట కూర్చున్నాను. ఈ మారు నిజంగా తొమ్మిదిన్నరయింది. వెంటనే లేచి క్రిందకు దిగి వచ్చాను.

నేను డైనింగ్ రూంలోకి ప్రవేశించేసరికే లాలా టేబుల్ ముందున్నాడు.

“కమాన్ ప్రొఫెసర్! టేక్ యువర్ సీట్!” అన్నాడు.

వెళ్ళి కూర్చున్నాను. టేబుల్ నిండా రకరకాల తినుబండారాలున్నాయి. వాట్ని చూశాక నాకు ఎడారిలో వుంటున్నట్లు తోచలేదు.

"రెండు నిమిషాలు వెయిట్ చెయ్యండి. మేడమ్ జాయినవుతుంది" అన్నాడు లాలా.

మేడమ్ వచ్చింది. లాలా ప్రక్కనే నా కెదురుగా కూర్చుంది.

"వీరు ఎడారిలో ఇసుక తుఫానులో చిక్కుకుపోయి వుంటే ఇంటికి తీసుకొచ్చాను. ఇందాక నే చెప్పింది వీరి గురించే" అంటూ నన్ను పరిచయం చేశాడు.

"నా భార్య!" అంటూ నన్నామెకు పరిచయం చేశాడు.

ఆమె నన్ను తెలీనట్లు, నిరుత్సాహంగా "అలా గా!" అనిమాత్రం అంది.

అందరు తినడం ప్రారంభించేశాం.

"ఈయన భార్య ఎవరితోనో లేచిపోయింది" అన్నాడు లాలా తన భార్యతో. నా గురించి ఆమెకు నాముందే అలా చెప్పడం కొంత ఎబ్బెట్టుగా కనుపించింది.

"ఎందుకని?" అడిగింది ఆమె అనాసక్తంగా.

"ఇంకొకడి వల్లో పడిందట."

"రియల్లీ!" నన్నుచూసి అడిగిందామె.

అవునన్నట్లు తలూపాను.

"ఆ తర్వాత ఈయన మానసికంగా బతికిపోయాడు. భౌతికంగా దెబ్బతిన్నాడు. మళ్ళీ పెళ్ళికి పనికిరాకుండా పోయింది ఈయన శరీరం" అన్నాడు లాలా గర్వంగా.

"సారీ!" అంది ఆమె తింటూనే.

"అందరికీ సక్రమంగా సంసారం సాగించే అవకాశా లుండవు డియర్. మనం ఎడారిలో వున్నాం. అయినా మనకేం తక్కువ. అతను బొంబాయిలో వున్నాడు. అతడి కేమీ లేదు. ప్రొఫెసర్ మీకు జీవితమంటే విరక్తిలేదా?"

"ఉంది. అరేబియా సముద్రంలో దూకి చద్దామను

కుంటూ వుంటాను. కానీ కళ్ళముందు పిల్లలు తిరుగుతుంటారు. వాళ్ళు అనాథలైపోతారు. నే చచ్చాక వాళ్ళను చూసేదెవరు? వాళ్ళకు చదువు సంధ్యలు, తిండీ బట్టా ఎవరు ఇస్తారు. అందుకోసమే మొండిగా బ్రతుకుతున్నాను'' అన్నాను.

''ఒక లక్ష్యసాధనకు, పవిత్రమైన ధ్యేయంతో మనిషి బ్రతకడం గొప్ప విషయమే. మీకు చావాలనిపించినప్పుడు నాకు చెప్పి చావండి. మీ పిల్లలకు అన్ని వసతులు ఏర్పాటుచేస్తాను'' అన్నాడు లాలా.

''వాట్ డియర్! అతన్ని చావమని మీరెందుకు ప్రోత్సహించడం!'' అడిగింది మేడమ్.

''ప్రోత్సహించడం కాదు! అలా చనిపోయినా ఫరవా లేదని చెప్పాను. అంతే!'' అన్నాడు లాలా.

తినటం పూర్తయింది. ఆ తర్వాత ఆపిల్ జ్యూస్ త్రాగాం.

''ప్రొఫెసర్ గారూ మీరు వెళ్ళండి! రెస్ట్ తీసుకోండి. మేమలా తోటలోకి వెళ్ళివస్తాం!'' అన్నాడు లాలా.

నే లేచేటప్పుడు ఆమె కళ్ళలోకి చూశాను. తను చెప్పినమాట మరచిపోవద్దన్నట్లుగా చూశాయి ఆమె చూపులు.

7

మెట్లెక్కి మేడపైకి వచ్చాను. డ్రెస్ మార్చుకుని కూర్చున్నాను.

లాలాగురించే ఆలోచించసాగాను. అతనిలో 'సాడిజం' అంటే అవతలివాళ్ళ బలహీనతల్ని ఎత్తి చూపించి, అవహేళన చెయ్యడం ఎక్కువగా తోచింది.

నన్ను కించపరిస్తే తప్ప, భార్య ముందు తన గొప్ప తనం అర్థంకాదనుకున్నట్లుగా ప్రవర్తించాడు లాలా. అతనిపైన కసి తీర్చుకోదలచుకున్నాను.

నా ఆలోచనలెటో పోయాయి. తెలీకుండానే కళ్ళు మూతలు పడ్డాయి. నా గదిలో లైటు వెలుగుతూనే వుంది.

ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది.

గబగబ లేచివెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా లాలా కనుపించాడు.

"గంట పన్నెండయింది. ఇంకా లైటు వెలుగుతుంటే ఏం చేస్తున్నారో చూద్దామని వచ్చాను. నిద్రపట్టలేదా?"

"లేదండీ! నిద్రపోయాను. తలుపు చప్పుడయితే లేచాను" అన్నాను.

"వెళ్ళి లైటార్పి పడుకోండి!" అన్నాడు లాలా.

అలాగే అంటూ తలుపులు మూసి లైటు స్విచ్ నొక్కాను. బయట నా గది తలుపులకున్న గొళ్ళెంలాగిన శబ్దం వినిపించింది.

దిక్కుచచ్చిపోయాను.

లాలా అలా ఎందుకు చేసివుంటాడో అర్థంకాలేదు. అతను నా కథ నమ్మకపోవడమన్నా కారణం కావాలి. లేదా నేను, మేడమ్ మెట్లపైన మాట్లాడుకోవడమన్నా చూసివుండాలి. ఈ రెంటిలో ఏదో ఒకటి జరిగి వుంటుం దనుకున్నాను. రెండోది జరిగి వుంటే, అతను ఆమెను తన గదిలోంచి వెలుపలకు వచ్చే అవకాశం కలుగనివ్వడు. ప్రయత్నం చెయ్యవలసిన పరిస్థితిలో లేను నేను.

అంతా మరిచిపోయి ముసుగుతన్ని పడుకోవడంకన్నా వేరే దారి కనుపించలేదు నాకు. అప్పటికే కిటికీలు చెక్

చేశాను. వెంటిలేటర్లు వెతికాను ఏదైనా మార్గం దొరుకు తుందేమోనని. అన్నింటికీ తగిన అడ్డంకులున్నాయి.

నా గదిలో నన్ను బందీగా పెట్టాడు లాలా.

అతిథిపైన అంత అపనమ్మకం భార్యమీద అంత అనుమానం వున్న వ్యక్తిని ఇంతకుముందు నేను చూడలేదు. ఒకవేళ చూసినా, ఇంత బరితెగించి ప్రవర్తించగలగడం, ఒక్క లాలాకే సరిపోయిందనుకున్నాను.

నాకు కోమలి గుర్తొచ్చింది. ఇసుక తుఫాను, నా కారు, నడక, పెట్రోలు బంకులో కుష్ఠురోగి, అన్నీ గుర్తొచ్చాయి.

పాత అనుభవాలు నెమరువేసుకుంటూ పడుకున్నాను. నన్ను నిద్ర ఆవహించింది. అలానే నిద్రపోయాను.

చాలా సేపటి తర్వాత ఎవరో నా మంచంపైన కూర్చొని చేతి వ్రేళ్ళతో నుదుటిని, తల వెంట్రుకలను సర్దుతున్నట్లు లీలగా అనిపించింది. కలేమోననుకొన్నాను.

నా శరీరానికి వెచ్చగా ఇంకో శరీరం తగిలింది. కరెంటు షాకు తగిలినట్లయింది. ఠక్కున లేచి కూర్చున్నాను. గదంతా చిమ్మచీకటి నిండిపోయింది. ఆ చీకట్లో ధగధగ మెరుస్తున్న రాళ్ళ నెక్లెను మాత్రం కనిపించింది.

“ఎలా వచ్చావ్?”?” అడిగాను మెల్లగా.

“ష్!” నన్ను మాట్లాడవద్దన్నట్లు తన చేతులతో నా నోరు మూసింది. ఆమెను నా కౌగిట్లోకి లాక్కున్నాను.

“లాలా చూడలేదా?” అడిగాను ఆతృతగా.

“ఊఁ!” అంది మాటలు అవసరం లేదన్నట్లు.

ఇక ప్రశ్నలువేసి లాభం లేదని నేనూ ముగించుకున్నాను. నా గదిలో ఆమె దాదాపు గంటపైనే వుంది.

నేనామె బుగ్గలు కొరికాను. గాయమైంది కాబోలు "అబ్బా!" అనిమాత్రం మెల్లగా అంది బాధను అదిమి పెట్టుకుని.

"సారీ! ఎక్సయిట్ అయ్యాను" అన్నాను.

"ఉష్!" అంది మళ్ళీ.

ఆమె మెడ తడిమాను. నెక్లెసు పట్టుకుని చూశాను. ఆమె నా కోరిక అర్థంచేసుకుందో ఏమో వెంటనే నెక్లెను తీసి ఇచ్చేసింది. బట్టలు సర్దుకొని గదిలోంచి లేచి వెళ్ళిపోయింది.

నెక్లెసుతీసి దిండుక్రింద పెట్టుకొని పడుకున్నాను నేను. ఆ తర్వాత హాయిగా నిద్రపోయాను.

8

తలుపు తీసిన చప్పుడయితే లేచాను. ఎదురుగా సర్వెంట్ కాఫీ ట్రేతో వచ్చి నిల్చున్నాడు. టైం చూశాను. ఎనిమిదయింది. కిటికీలోంచి ఎండ గదిలో పడుతూంది.

కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ త్రాగాను. దిండు పైకెత్తి చూసుకున్నాను. నెక్లెను కనిపించింది. అంటే రాత్రి జరిగింది కలకాదనీ, నిజమనీ అర్థమయిపోయింది.

లాలా నన్ను ఆత్మహత్య చేసుకోమన్నాడు. ఈ నెక్లెను పార్సిలు చేరాక చూసి అతనే పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటాడనుకున్నాను కసిగా.

గదిలోవున్న ఇంటర్‌కామ్ ఫోను మోగింది. లేచి అందుకున్నాను. "హల్లో! ప్రొఫెసర్! గుడ్‌మార్నింగ్!" అన్నాడు లాలా.

"మార్నింగ్ సార్!" అన్నాను నేను.

"రాత్రి బాగా నిద్ర పట్టిందా?"

"ఆఁ! మొద్దునిద్ర పోయాను."

"మీకోసం మేమంతా వెయిట్ చేస్తున్నాం. రండి. బ్రేక్ ఫాస్ట్ రెడీగా వుంది."

"వచ్చేస్తున్నాను!" అంటూ ఫోన్ కట్ చేసి వెలుపలికొచ్చాను.

టేబుల్ దగ్గరకెళ్ళేసరికి లాలా కూర్చుని వున్నాడు. చుట్టూ సర్వెంట్స్ నిలుచున్నారు.

"మేడమ్ రాలేదా?" అడిగాను.

"ఆమెకూడా మీలాగే మొద్దునిద్ర పోయిందట" అన్నాడు లాలా.

అంత సుఖం రుచిచూశాక నిద్రరాక మరేమొస్తుందని లోలోపలే అనుకున్నాను.

ఆ తర్వాత మేడమ్ వచ్చి కూర్చుంది నా కెదురుగా.

"నాకోసం ఎందుకు వెయిట్ చేశారు? మీరు ప్రారంభించకపోయారా?" అంది మేడమ్ స్పూన్ను చేతికి తీసుకుంటూ.

ఆమెకేసి నిశితంగా చూశాను. బుగ్గలు మామూలుగా వున్నాయి. ఆమె మెడ పరిశీలించాను. రాళ్ళ నెక్లెసు ధగధగ మెరసిపోతూంది. ఆ రెండూ చూశాక నాకు మతిపోయింది.

ఆమె నాకు రాత్రి నెక్లెసు ఇచ్చింది. మళ్ళీ అదే మెడలో కనిపిస్తూంది. ఎలా సాధ్యం! నేను గదిలోంచి వచ్చాక ఆమె వెళ్ళి, తలగడ క్రిందదాచిన నెక్లెసు తీసుకుందేమోననుకున్నాను.మరి బుగ్గలమీద గాయం కావాలి. అలాంటిదేమీ కనుపించలేదు. గాయాలు కన్పించకుండా ఏదైనా లోషన్సు, క్రీమ్‌లు వున్నాయేమోలేనని సర్దిచెప్పుకున్నాను.

టేబిల్ ముందుకు రాబోయే ముందున్న ఉత్సాహం, వచ్చాక చచ్చిపోయింది నాకు.

టిఫిన్లు పూర్తిచేసి కాఫీ త్రాగుతున్నాం.

"ప్రొఫెసరుగారూ! మనం వెళ్ళి మీ కారు సంగతి ఏమైందో చూసివద్దామా?" అన్నాడు లాలా.

"వద్దాంసార్!" అన్నాను.

"అయితే పదండి" అన్నాడు లాలా.

"ఇప్పుడే వస్తాను. తాళాలు పైనున్నాయి. తీసుకుని వస్తాను" అంటూ జవాబుకోసం చూడకుండా మెట్లెక్కి వెళ్ళాను నా గదికి.

తలగడ ఎత్తి చూశాను. రాళ్ళ నెక్లెసు భద్రంగా వుంది. దాన్ని యథాస్థానంలో వుంచేశాను. ఆమెకు అలాంటి నెక్లెసులే రెండు వుండుంటాయి. ఒకటి నాకిచ్చింది. రెండోది తను వేసుకొచ్చింది అనుకున్నాను.

క్రిందికి దిగివచ్చాను. లాలా ఒక్కడే నిలుచుని వున్నాడు నాకోసం.

"రెడీయా?" అడిగాడు.

"రెడీయే!" అన్నాను.

ఇద్దరం పోర్టికోలో వున్న జీప్ ఎక్కాం. జీపు రివ్వుమని దూసుకుపోయింది.

9

మేము మళ్ళీ తిరిగొచ్చేసరికి గంట ఒకటయింది. రాగానే భోజనాలకు కూర్చున్నాం.

"కారు సంగతి ఏమయింది?" అడిగింది మేడమ్.

"అంతా తీయించాను. మనదగ్గర స్పేర్ టయిర్ వుంటే ఇచ్చాను. దాన్ని ఫిట్ చేసి పెట్రోలుపోసి, ఈ రాత్రిలోగా తెచ్చి వుంచుతానన్నాడు పెట్రోలుబంకు

వాడు. ప్రొఫెసర్ గారు రేపుదయం వెళ్ళిపోతారు'' అన్నాడు లాలా.

''లాలాగారూ! వాడిచేతులూ కాళ్ళూ కుష్ఠుపట్టి వున్నాయి. డ్రైవర్ మార్చగలడంటూరా?'' అన్నాను.

''మా కార్లు, జీపులు రిపేరుచేసేది వాడే!''

''నాకు కుష్ఠురోగులంటే భయమండీ! ఆ వ్యాధి అంటే పరమ అసహ్యం. నిన్న వాడు కాఫీ త్రాగమనీ, మంచి నీళ్ళు త్రాగమనీ పదేపదే అడుగుతుంటే, భయం పుట్టుకొచ్చింది. అది అంటువ్యాధి. మనకు అంటుకుందంటే చచ్చామే!'' అన్నాను.

''అవును'' అన్నాడు లాలా.

మేడమ్ మా మాటలు మౌనంగా వింటూ భోజనం చెయ్యసాగింది.

''ఈ వ్యాధి తొందరగా ఎవరికొస్తుందో తెలుసా?'' అడిగాడు లాలా.

''తెలీదు'' అన్నాడు.

''కుష్ఠురోగం వున్న స్త్రీ పురుషులు ఒకరితో ఒకరు సంభోగించినప్పుడు. అందుకే ఇది ఎక్కువగా అడుక్కు తినిబ్రతికే మనుషుల్లో ప్రబలుతుంది. ఇంకోరకం విపరీతంగా స్త్రీవ్యసనంలో పడినవాళ్ళకూ''అన్నాడు లాలా.

''మీరుకూడా దీనిగురించి చాలా రిసెర్చి చేసినట్లున్నారే!'' అన్నాను.

''ఏదో పత్రికల్లో చదివిన విషయాలు. ఋషికేశీలో వాళ్ళకోసం ఇరవై లక్షలుపెట్టి మా ఆవిడ పేరుపైన ఒక పెద్ద హాస్పిటల్ కట్టించాను'' అన్నాడు లాలా.

''గుడ్! మీకు సాంఘిక సేవా నిరతి విశరణ వున్నాయన్నమాట'' అన్నాను.

అందరం భోజనాలు ముగించుకున్నాం. ఎవరి గదులకు వాళ్ళం వెళ్ళాం. నేను సాయంత్రం దాకా రెస్ట్ తీసుకున్నాను.

ఏడింటికల్లా గదిలోకి వచ్చాను. సర్వెంట్ తెచ్చిన టీ త్రాగాను. జేబులోవున్న రాళ్ళ నెక్లెస్ తీసి చూసుకున్నాను.

ఎనిమిదింటికి ఫోన్ మ్రోగింది.

రిసీవరు పైకెత్తి "హలో!" అన్నాను.

"రాత్రిలాగే వస్తాను! సిద్ధంగా వుండు" అందామె ఫోన్‌లో.

"ఓ.కే! నీకు రాళ్ళ నెక్లెసులు ఎన్ని వున్నాయి" అడిగాను.

అప్పటికే అవతలివేపు ఫోన్ పెట్టేసినట్లు క్లిక్‌మన్న శబ్దం అయింది. నేను ఫోన్ చేసేందుకు వీలులేదు. ఆమె గది నెంబరు నాకు తెలీదు. ఖర్మకాలి నా ఫోన్ కాస్తా తిన్నగా లాలాగారి గదికి వెళ్ళిందంటే రహస్యం బైట పడుతుందని భయపడి కూర్చున్నాను.

ఆ రోజుకూడా తొమ్మిదిన్నరకల్లా భోజనాలు చేశాం.

"మీ కారు సిద్ధంగా వుందని ఫోన్ వచ్చింది. తెల్లవారాక వెళ్తారా?" అడిగాడు లాలా.

"ఆఁ!" అన్నాను.

"మాతో ఈ రెండ్రోజులు గడిపినందుకు ఆనందంగా వుంది. ఈ మారు ఇటు ప్రక్క రావడం జరిగితే మరచిపోకుండా వచ్చిపోండి. మీకోసం మా యింటి తలుపులు తెరచే వుంచుతాం!" అన్నాడు లాలా.

"అలాగే!" అన్నాను.

"థాంక్స్!" అంటూ లేచాడు లాలా. ఆమెకూడా అతనివెంట గార్డెన్‌లోకి వెళ్ళిపోయింది.

నేను మెల్లెక్కి నా గదికి వెళ్ళాను. ఒక పుస్తకం కనుపిస్తే చదువుకుంటూ పడుకున్నాను. ఒంటిగంటదాకా నిద్ర పట్టనే లేదు. ఆ తర్వాత లైట్లారిపోయాయి. జెనరేటరు ఆగిపోయిందేమోననుకుని పుస్తకం పక్కన పెట్టి పడుకున్నాను. అనుమానం వచ్చి కిటికీ దగ్గరకు వెళ్ళి వెలుపలకు చూశాను. తోటలో లైట్లు వెలుగుతున్నాయి.

అంటే ఇంటికున్న కనెక్షను చెడిపోయి వుండాలనుకున్నాను. ఈ రాత్రికూడా ఆమెను చూచే అవకాశం నాకు బహుశా దొరకదేమోననిపించింది. కళ్ళు మూసుకుని పడుకున్నాను.

10

తలుపు మెల్లగా తెరచిన శబ్దం అయింది. లోపల కాలి అడుగుల చప్పుడయింది. లేచి కూర్చున్నాను. వెంటనే తలుపులు మూసుకుపోయాయి. తుదకు నా దగ్గరకు వచ్చి మంచంపైన కూర్చుంది.

"ఇవాళంతా నన్ను ఎరగనట్లే నటించావ్?" అడిగాను మెల్లగా.

"ఉష్!" అంది.

దగ్గరకు లాక్కున్నాను.

ఆ చీకట్లో మేమిద్దరం కలసిపోయాం.

ఐదు నిముషాల తర్వాత విడివడ్డాం.

"నిన్ను దగ్గరగా చూడాలని వుంది!" అన్నాను.

"ఉష్!" అందామె మళ్ళీ.

ఆమె మెడకేసి చూశాను. నెక్లెస్ లేదు.

"నెక్లెసు వేసుకురాలేదేం!" అడిగాను.

ఆమె మాట్లాడలేదు.

"రేపు వెళ్ళిపోతున్నాను" అన్నాను.

ఆమె బాధపడుతుందేమో ననుకున్నాను. అలాంటి దేమీ కనిపించలేదు.

"థాంక్స్! వస్తాను" అంటూ కదలింది గదిలోంచి. ఆమె కన్నా రెండడుగులు ముందుకు వేసి స్విచ్ ఆన్ చేశాను.

లైటు వెలిగింది.

ఆ వెలుతురులో ఆమెను చూశాను. చూడగానే నోట మాట రాలేదు నాకు.

ఆమె మేడమ్ కాదు. అచ్చం లాగే ఎత్తూ, లావూ వుంది. కాళ్ళ వేళ్ళూ, కనుపించకుండా సాక్స్. చేతి వేళ్లు కనుపించకుండా గ్లౌవ్స్ వేసుకుంది. అది నేను గుర్తించలేక పోయాను.

"అవెందుకు?" అడిగాను.

చేతి గ్లౌవ్స్ తీసి చూపించింది. ఆమె వేళ్ళు తెగి వున్నట్లున్నాయి.

ఆమె కుష్ఠురోగి అని తెలుసుకోవడానికి నాకు ఎక్కువ టైం పట్టలేదు. నా నెత్తిన పిడుగులు పడ్డట్లయింది.

"నువ్వెవరు?" గర్జించాను.

"లాలా గారి అమ్మాయిని. నా కోసం అమ్మా నాన్న సిటీకి దూరంగా వచ్చి వున్నారు. నాకు మగవాళ్ళంటే పిచ్చి. ఎవ్వరూ పెళ్ళాడరు. అప్పుడప్పుడు నీలాంటి వాళ్ళు వస్తారు. పోతారు."

"ఈ విషయం మీ అమ్మకూ నాన్నకూ తెలుసా?"

"ఊఁ! మా అమ్మదని చెప్పే బెడ్ రూం నాదే!" అంది ఆ అమ్మాయి.

నాకు ఒంట్లోని రక్తమంతా ఎరుపురంగునుంచి నలుపు రంగుకు తిరిగిపోయినట్లు, కాళ్ళూ చేతులూ తెగిపోయినట్లు ఫీలయ్యాను. కుప్పలా కూలబడుతూ "ఇది మోసం?" అన్నాను.

"నీది! మగతనం లేదని చెప్పావుట. మోసంకాదా?" అంటూనే లైటార్పి ఆమె గదిలోంచి వెళ్ళిపోయింది.

పెట్రోలు బంక్ వాడు ఫోన్‌లో మాట్లాడింది, ఆ వెంటనే లాలా వచ్చి నన్ను తీసుకురావడం గుర్తొచ్చాయి. ఇదంతా ప్లాను ప్రకారం జరుగుతున్నదని అర్థమయిపోయింది.

అయినా నేను చెయ్యగలిగిందేమీ లేదు. నా రక్తంలో విషంచుక్క కలిసిపోయింది. జీవితమంతా దేన్ని చూసి భయపడ్డానో అదే నా శరీరంలో ఎక్కి కూర్చుంది. అలాగే పడిపోయాను.

—: ఐపోయింది :—